క్లుప్తంగా

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషిచేయాలి



మంత్రి పినిపే విశ్వరూప్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఏలూరు(మెట్రో): జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. ఏలూరు జెడ్పీ క్యాంపు కార్యాలయంలో గురువారం నూజివీడు నియోజకవర్గ ఎమ్మెల్యే మేక వెంకట ప్రతాప్ అప్పారావు, దెందులూరు ఎమ్మెల్యే కొఠారి అబ్బయ్య చౌదరి, చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీతో జిల్లా అభివృద్ధిపై ఆయన కొద్దిసేపు ముచ్చటించారు. జిల్లాను అభివృద్ధి పథంలో నడపడానికి పలు సూచనలు చేశారు. ఈనెల 5న జరిగే జిల్లా ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశ ఏర్పాట్ల గురించి చైర్‌పర్సన్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో దెందులూరు మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ అప్పన ప్రసాద్ విశ్వరూప్‌ను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాద్, రాష్ట్ర వడ్డీ కార్పొరేషన్ డైరెక్టర్ మండల కొండలరావు, శ్రీరామవరం సర్పంచ్ కామిరెడ్డి నాని, బొడ్డు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సాగు పట్టాలు మంజూరు చేయాలి



మహిళా రైతు కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న దళిత మహిళలు, దళిత సేన నాయకులు

ఏలూరు (టూటౌన్): దళిత, వెనుకబడిన వర్గాల రైతులకు సాగు పట్టాలు, చెట్టు పట్టాలు మంజూరు చేయాలని ఏలూరు జిల్లా దళితసేన రైతు విభాగం విజ్ఞప్తి చేసింది. స్థానిక ఆర్‌ఆర్‌పేటలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో లింగపాలెం మండలం తోచలకరాయుడుపాలెం దళిత సేన మహిళా రైతుల సమావేశం గురువారం పింగుల ఇదియా అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో ఉన్న ప్రభుత్వ పోరంబోకు, అటవీ, గయ్యాలి, గుట్ట పోరంబోకు భూములును సాగు చేసుకునే దళిత, వెనుకబడిన వర్గాల రైతులకు సాగు పట్టాలు, చెట్టు పట్టాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

మహిళల భద్రతే లక్ష్యం



ఏలూరులో దిశ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన మురళీకృష్ణకు పుష్పగుచ్ఛం అందజేస్తోన్న సీఐ శ్రీనివాసరావు

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మహిళల భద్రతే లక్ష్యంగా పనిచేస్తోందని, బాధిత మహిళలకు సత్వర న్యాయం, రక్షణ కల్పించటమే ధ్యేయమని ఏలూరు దిశ డీఎస్పీ నున్న మురళీకృష్ణ చెప్పారు. ఏలూరు జిల్లా దిశ డీఎస్పీగా ఆయన ఏలూరులోని దిశ పోలీస్‌స్టేషన్‌లో గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు బాధిత మహిళలకు సత్వర న్యాయం, నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పోక్సో కేసుల్లో నిందితులకు త్వరితగతిన శిక్షలు విధించేలా చార్జిషీట్లు దాఖలు చేయడం, దర్యాప్తును వేగంగా పూర్తి చేస్తామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రజలకు మహిళా చట్టాలపై గ్రామ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులకు అవగాహన కల్పిస్తామన్నారు. కళాశాలలు, ప్రధాన రహదారుల్లో బాలికలు, విద్యార్థినిలపై వేధింపులకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

అభివృద్ధి పథంలో 16వ డివిజన్

- 650 మందికి ఇళ్ల పట్టాలు అందజేత
- రూ.23 లక్షలతో స్కూల్ అభివృద్ధి
- రూ.90 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ

ఏలూరు టౌన్: ఏలూరు నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ.. ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని ఏలూరులో అన్ని డివిజన్ల సంక్షేమానికి కృషి చేస్తున్నారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లోనూ అభివృద్ధి చేస్తూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నారు. ఆయన సహకారంతో ఏలూరు 16వ డివిజన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. వన్‌టౌన్‌లోని 16వ డివిజన్ కార్పొరేటర్ జిజ్జువరపు విజయనిర్మల, వైఎస్సార్‌సీపీ నాయకులు జిజ్జువరపు రమేష్ ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఎమ్మెల్యే ఆళ్ళ నాని అండదండలతో మౌలిక సదుపాయాల కల్పన కొనసాగుతోంది. డివిజన్‌లో సుమారుగా 2000 కుటుంబాలకు ప్రభుత్వం వివిధ రకాల సేవలు అందిస్తోంది. 16వ డివిజన్‌లో 5,800 మంది ఓటర్లు ఉండగా, అరుంధతీపేట, పాలతూము సెంటర్, చేపలచెట్టు సెంటర్, కొబ్బరి తోట, గంగానమ్మగుడి వీధి ప్రాంతాలు ఉన్నాయి.

అభివృద్ధి, సంక్షేమం ఇలా

ఏలూరు 16వ డివిజన్‌లో ఎమ్మెల్యే ఆళ్ళ నాని, మేయర్ షేక్ నూర్జహాన్ చేతులమీదుగా రెండేళ్ళ క్రితం సుమారుగా 650 మంది పేద కుటుంబాలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. జగనన్న కాలనీలోనే లబ్ధిదారులందరికీ పట్టాలు పంపిణీ చేయడంతో వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇక పాఠశాలల నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా రూ.23 లక్షల వ్యయంతో నగరపాలక పాఠశాలల రూపురేఖలు మార్చేశారు. కార్పొరేటర్ స్కూల్ తరహాలో డెస్కులు, డిజిటల్ బోధన, మరుగుదొడ్ల వసతి కల్పించారు. అరుంధతీపేట ప్రాంతంలో తీరని సమస్యగా ఉన్న అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణానికి ఎమ్మెల్యే ఆళ్ళ నాని భారీగా నిధులు మంజూరు చేశారు. సుమారుగా రూ.99 లక్షల వ్యయంతో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణాన్ని చేపట్టారు.



ఏలూరు వన్‌టౌన్ 16వ డివిజన్‌లో నాడు-నేడులో రూ.23 లక్షలతో అభివృద్ధి చేసిన పాఠశాల



డివిజన్‌లో ఇళ్ళ పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆళ్ళనాని, చిత్రంలో కార్పొరేటర్ విజయనిర్మల (ఫైల్)



అరుంధతీపేట ప్రాంతంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు

పేదల పెన్నిధి ఎమ్మెల్యే నాని



మాకు ఎన్నో ఏళ్ళుగా సొంతిల్లు ఉండాలని కోరిక. ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా మేలు చేయలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న ప్రభుత్వంలో ఎమ్మెల్యే ఆళ్ళనాని పేదలకు మంచి చేస్తూ ఇళ్ళ పట్టాలు పంపిణీ చేశారు. ఏలూరు నగరంలో ఎంతోమంది పేదలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా ఉంటూ గూడు కల్పించేందుకు చర్యలు చేపట్టింది. సంక్షేమ పథకాలు సైతం అందిస్తూ పేదల కుటుంబాలను ఆదుకుంటున్న ఏకైక సీఎం జగనన్న మాత్రమే.

– ఎస్‌కే పర్వీన్ బేగం, వన్‌టౌన్

అభివృద్ధి, సంక్షేమం రెండూ ముఖ్యమే



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హయాంలో, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళనాని నాయకత్వంలో నగరంలోని ప్రతి ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. మా డివిజన్‌లో 650 మంది పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీకి రూ.99 లక్షలతో పనులు చేపట్టారు. ప్రతి ఇంటిలోనూ సంక్షేమ పథకాలు అందుతున్నాయి.

– జిజ్జువరపు విజయనిర్మల, కార్పొరేటర్, 16వ డివిజన్

పౌష్టికాహారం కిట్ల పంపిణీ



టేక్ హోం రేషన్ పథకంలో భాగంగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తున్న డిప్యూటీ మేయర్ సుధీర్‌బాబు, కార్పొరేటర్ తంగెళ్ల రాము

ఏలూరు (టూటౌన్): వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారం బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు ఎంతో లబ్ధి చేకూరుస్తుందని డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్ బాబు అన్నారు. స్థానిక వెంకటాపురం పరిధిలోని అంగన్వాడీ కేంద్రంలో టేక్ హోం రేషన్ పథకంలో భాగంగా లబ్ధిదారులకు గురువారం కిట్లు అందజేసారు. ఈ సందర్భంగా సుధీర్ బాబు మాట్లాడుతూ పౌష్టికాహార లోపంతో తలెత్తే రక్తహీనత, మాతా శిశు మరణాలను పూర్తిగా అరికట్టే లక్ష్యంతో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ పథకాన్ని ప్రారంభించిందని గుర్తు చేశారు. లబ్ధిదారులకు ఇంటికే వైఎస్సార్ పోషణ కిట్లు అందజేయడం ద్వారా వారికి ఎంతో లాభం చేకూరుతుందన్నారు. స్థానిక కార్పొరేటర్ తంగెళ్ల రాము మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అందించే వైఎస్సార్ పోషణ కిట్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొబ్బరి రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలి



కొబ్బరి రైతుల జిల్లా సమావేశంలో పాల్గొన్న రైతులు

ఏలూరు (టూటౌన్): కొబ్బరి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో కొబ్బరి రైతుల జిల్లా సమావేశం గురువారం జరిగింది. కొబ్బరి రైతు సంఘం నాయకులు పానుగంటి అచ్యుత రామయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో కొబ్బరి రైతుల సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఎకరా కొబ్బరి తోటకు రూ.60 వేల వరకూ పెట్టుబడి అవుతుందన్నారు. చెట్టు నుంచి కాయ కోసి గుట్టగా పోసేందుకు రూ.4 ఖర్చు అవుతుండగా ఎండు కొబ్బరి కాయను కేవలం రూ.5కు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారన్నారు. దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నాఫెడ్, ఆయిల్‌ఫెడ్‌ల ద్వారా కొబ్బరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొబ్బరి కాయలను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. కొబ్బరి రైతుల జిల్లా సదస్సును ఈ నెల 8న పెదవేగి మండలం విజయరాయిలోని కోకోనట్ గ్రోయర్స్ అసోసియేషన్ హాలులో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు తెలియజేసారు. సమావేశంలో కొబ్బరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, కొబ్బరి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ నర్సింహ, కొబ్బరి రైతు సంఘం నాయకులు బొల్లి రామకృష్ణ, గుడిబండి రమేష్ రెడ్డి, గంటా పాపారావు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు, బొడ్డు రాంబాబు, కొబ్బరి రైతులు రామిరెడ్డి వెంకట నాగేశ్వర రెడ్డి, బండారు సత్యనారాయణ, వేపూరి శ్రీనివాసరావు, వి.రామారావు,ఎస్.సతీష్ కుమార్, పి.కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల కుట్రలు తిప్పికొట్టాలి

ఎమ్మెల్యే ఆళ్ళ నాని

ఏలూరు టౌన్ : రాష్ట్రంలో ప్రజలకు అత్యంత పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తూ, దేశంలోనే ఆదర్శవంతమైన పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపైనా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపైనా కుట్రలు, కుటిల రాజకీయాలు చేస్తున్న ప్రతిపక్షాల దుష్ప్రచారాలను సమర్థవంతంగా తిప్పికొట్టేందుకు సైనికుల్లా పనిచేయాలని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ళనాని పిలుపునిచ్చారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో టీం జగనన్న మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ చూపిన సోషల్ మీడియా బృందానికి ఆయన చేతులమీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ .. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ ప్రతిష్టను పెంచటంతోపాటు, ప్రజలకు వాస్తవాలను తెలియజేయాలని సూచించారు. ప్రతిపక్షాలు కావాలని నీచమైన రాజకీయాలు చేస్తున్నాయని, వాటిని ధీటుగా తిప్పికొట్టాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు, సోషల్‌మీడియా బృందానికి ఎల్లవేళలా అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన సోషల్‌మీడియా బృందానికి ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆళ్ళ నాని

చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలి

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఉత్తమ విద్య, పౌష్టికాహారాన్ని అందించాలని, చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని ఎమ్మెల్యే ఆళ్ళ నాని చెప్పారు. నియోజకవర్గ పరిధిలో పలు డివిజన్లలోని అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి ఐదు అంగన్‌వాడీ హెల్పర్లు, ఒక అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు ఎంపికైన వారికి నియామక పత్రాలను ఎమ్మెల్యే ఆళ్ళనాని చేతుల మీదుగా అందజేశారు. శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో నాని వారికి నియామక పత్రాలు అందజేశారు.

మెడికల్ కాలేజీలో అడ్మిషన్లకు సర్వం సిద్ధం

ఏలూరు టౌన్: ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో వైద్య విద్య అభ్యసించేందుకు మొదటి బ్యాచ్ విద్యార్థుల ప్రవేశాలకు కళాశాల యాజమాన్యం సర్వం సిద్ధం చేసింది. ఏలూరు జీజీహెచ్ ప్రాంగణంలో ప్రత్యేకంగా కౌన్సెలింగ్ హాలును ఏర్పాటు చేశారు. ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీలో చేరేందుకు వస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ప్రొఫెసర్లు, నిపుణుల బృందం అవగాహన కల్పిస్తోంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కేవీవీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో వైస్ ప్రిన్సిపల్ కే.భాస్కర్, ప్రొఫెసర్ పి.సత్యనారాయణ రాజు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, నిపుణుల బృందం ప్రత్యేకంగా కౌన్సెలింగ్ కౌంటర్లు ఏర్పాటు చేసి విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలకు ఆల్ ఇండియా కేటగిరీలో 22 సీట్లు కేటాయింపు చేసిన నేపథ్యంలో విద్యార్థుల ప్రవేశాలకు ఏర్పాట్లు చేశారు. మెడికల్ కాలేజీలో చేరేందుకు వస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కాలేజీలోని పరిస్థితులు, వసతి సౌకర్యాలు, క్లాస్‌రూమ్స్ వివరాలు, భవిష్యత్తులో ఎలాంటి పరిస్థితులు ఉంటాయో పూర్తిగా వివరిస్తున్నారు. కాలేజీ ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ప్రవేశాలు ఈ నెలాఖరులోపు పూర్తి చేస్తారని, సెప్టెంబర్ 1 నుంచి తరగతులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. ఆలిండియా కేటగిరీలో సీట్లు కేటాయింపు పొందిన విద్యార్థులు శుక్రవారం సాయంత్రం 4 గంటలలోపు రిపోర్ట్ చేయాల్సి ఉందని తెలిపారు. ఏలూరు పాతబస్టాండ్ సమీపంలో డీఎంహెచ్‌వో కార్యాలయ ప్రాంగణంలో మూడు అంతస్తుల్లో నిర్మిస్తోన్న మెడికల్ కాలేజీ భవనం పూర్తి కావస్తుందని, క్లాసులు ప్రారంభించేనాటికి సిద్ధం చేస్తారని చెప్పారు. అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ ల్యాబ్‌లతోపాటు, రెండు ఆధునిక సౌకర్యాలతో కూడిన తరగతి గదులు ఉంటాయని తెలిపారు. ఏలూరు జీజీహెచ్ ప్రాంగణంలోనే మెడికల్ విద్యార్థులకు వసతి సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. 110 మంది విద్యార్థులకు వసతి కల్పించేలా నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయని వివరించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీకి సంబంధించి 11మంది ప్రొఫెసర్లు నియామకం పొందాల్సి ఉండగా 10 మంది ఉన్నారని, అసోసియేట్ ప్రొఫెసర్లు 25 మందికి 20 మంది, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 42 మందికి 33 మంది విధులు నిర్వర్తించేందుకు సిద్ధంగా ఉన్నారని ప్రిన్సిపల్ చెప్పారు.



ఏలూరు జీజీహెచ్‌లోని కౌన్సెలింగ్ హాలులో మెడికల్ కాలేజీలో చేరేందుకు వస్తున్న వారికి అవగాహన కల్పిస్తున్న నిపుణుల బృందం

ప్రభుత్వ కళాశాలల్లో హాస్టళ్లు ఏర్పాటు చేయాలి



సాంఘిక సంక్షేమ శాఖ జేడీ వి.జయప్రకాష్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు, నారాయణపురం ప్రభుత్వ కళాశాలల్లో కాలేజీ హాస్టళ్లు ఏర్పాటు చేయాలని కోరుతూ సాంఘిక సంక్షేమశాఖ జేడీ వి.జయప్రకాష్‌కు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ మాట్లాడుతూ ఏలూరు కోటదిబ్బ డిగ్రీ కాలేజీ, జూనియర్ కాలేజీ విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండేలా కాలేజ్ హాస్టల్ ఏర్పాటు చేయాలన్నారు. ఏలూరు డిగ్రీ, జూనియర్ కాలేజ్‌లకు దూర ప్రాంతాల నుంచి దాదాపు 200 మంది విద్యార్థులు వస్తున్నారన్నారు. అక్కడే హాస్టల్ ఏర్పాటు చేస్తే విద్యార్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఉంగుటూరు మండలం నారాయణపురంలోని హైస్కూలు, జూనియర్, డిగ్రీ కాలేజీ విద్యార్థులకు ఉపయోగపడే విధంగా కాలేజీ హాస్టల్ ఏర్పాటు చేయాలన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	37
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	38
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	38
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	31

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	20
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	29
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	32
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	08.00	4794	33
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	34
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు -తిరుపతి	16.00	4830	28

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని శనివారపుపేట 33/11 కేవీ సబ్ స్టేషన్, 11 కేవీ సిద్ధార్థ ఫీడర్ పరిధిలో వార్షిక మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించే నిమిత్తం నగరంలోని వివిధ ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టీ.శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆయా ఫీడర్ల పరిధిలోని ఆర్టీసీ కాలనీ, సౌభాగ్యలక్ష్మి దేవస్థానం ప్రాంతం, సత్రంపాడు, శనివారపు పేట, విద్యానగర్, శ్రీరామ్ నగర్, శాతవాహన నగర్, దుగ్గిరాల పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

నేడు చేతివృత్తిదారుల జిల్లా సమావేశం

ఏలూరు (టూటౌన్): ఆంధ్రప్రదేశ్ చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ ఏలూరు జిల్లా విస్తృత సమావేశం ఈ నెల 4న ఉదయం 10 గంటలకు ఏలూరు అగ్రహారం కెనాల్ రోడ్డులోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరుగుతుందని జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో జిల్లాలోని అన్ని వృత్తి సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

మణిపూర్ ఘటన నిందితులను శిక్షించాలి

ఏలూరు (టూటౌన్): మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, విజయవాడలో న్యాయవాది పెట్టల బాబును హత్య చేసిన వారిని శిక్షించాలని కోరుతూ ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలు) ఏలూరు నగర కమిటీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఓరుగంటి శైలజ మాట్లాడుతూ మణిపూర్‌లోని కొండల్లో ఉన్న గ్రానైట్ గనులను ప్రైవేటు వారికి కట్టబెట్టే ఆలోచనల్లో కేంద్ర ప్రభుత్వం పన్నిన కుట్రలో భాగమే ఈ దాడులన్నారు. వెంటనే మణిపూర్ ముఖ్యమంత్రిని తొలగించాలని డిమాండ్ చేశారు. విజయవాడలో న్యాయవాది విఠల్ బాబు హత్య దారుణమన్నారు. కార్యక్రమలో ఏలూరు కమిటీ కార్యదర్శి గెద్దాడ విజయభాస్కర్, యూనియన్ నగర కమిటీ సభ్యులు జిల్లెళ్లమూడి ప్రసాద్, పి.రాజారావు, న్యాయవాదులు ఆంజనేయులు,హెచ్.కిషోర్, జి.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతీ కుటుంబంలోనూ పెద్దన్నలా అక్కాచెల్లెమ్మలకు అండగా ఉంటున్నారని ఏలూరు 9వ డివిజన్ కార్పొరేటర్ సబ్బన శ్రీనివాసరావు అన్నారు. ఏలూరు వన్‌టౌన్‌లోని 79, 80, 81,82, 85 అంగన్‌వాడీ కేంద్రాల వద్ద తల్లిపాల వారోత్సవాలు గురువారం చేపట్టారు. కార్పొరేటర్ శ్రీనివాసరావు హాజరై తల్లులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. తంగెళ్ళమూడి ప్రాంతంలోని గంగానమ్మ గుడి ప్రాంతంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో 48వ డివిజన్ కార్పొరేటర్, వైఎస్సార్‌సీపీ మహిళ నాయకురాలు నున్న స్వాతిశ్రీదేవి హాజరై తల్లులకు ప్రభుత్వం అందించే పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు.